క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నార్కట్‌పల్లి : రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మండల కేంద్రంలో చెట్లు తొలగించే కార్యక్రమం ఉన్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు చంద్రశేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

బాధితులకు ఆర్థికసాయం

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని దోమలపల్లిలో గడ్డం యాదయ్య ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ గురువారం పరామర్శించి రూ 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

నాంపల్లి : మండలంలోని పసునూర్ గ్రామానికి చెందిన పంబాల చెన్నమ్మ, చల్లవానికుంట ఆవాస తండా కలమంద బావిలో నేనావత్ శక్రు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత


ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ : మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన పాతగోని ముత్యాలుకు మంజూరైన రూ.లక్ష విలువగల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హైదరాబాద్‌లో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాక నగేష్‌యాదవ్, పాతగోని రమేష్, రాజు, శ్రీను పాల్గొన్నారు.

కేటీఆర్‌కు వినతి


కేటీఆర్‌కు విన్నవిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : నకిరేకల్, చిట్యాల మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ శ్వేత

నాంపల్లి : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జన ఆరోగ్య సమితి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండల వైద్యాధికారి ఎండీ ఇక్బాల్, సర్పంచ్‌లు బాసిపాక రాములు, బల్గూరి విష్ణువర్ధన్, సీడీపీఓ లావణ్యకుమారి తదితరులు ఉన్నారు.

పట్టా రద్దు చేయాలని వినతి

కట్టంగూర్ : మండలంలోని మునుకుంట్ల గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 636లో గల 6 ఎకరాల భూమికి అక్రమంగా చేసిన పట్టాను రద్దు చేయాలని కోరుతూ మునుకుంట్ల గ్రామ సర్పంచ్ భర్త గడుసు సుధీర్‌రెడ్డి గురువారం కట్టంగూర్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో నివాసం లేని కీసర అనసూర్యమ్మ డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్‌షిప్ సర్టిఫికెట్‌ను గతంలో పనిచేసిన తహసీల్దార్ జారీ చేశారని తెలిపారు. అనసూర్యమ్మకు ఇద్దరు కుమారులున్నప్పటికీ ఒక్కడే వారసుడని ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేసి 6 ఎకరాల భూమిని పట్టా మార్పిడి చేశారని పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్‌పై, ఇన్‌చార్జ్ సెక్రటరీపై తగు చర్యలు తీసుకొని పట్టా రద్దు చేయాలని కోరారు.

ఇంటింటా మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

నకిరేకల్ : హరితహారంలో భాగంగా నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు మార్కెట్ రోడ్డు, రంగారెడ్డినగర్, సుందరయ్యనగర్, వైఎస్సార్ కాలనీల్లో గురువారం ఇంటింటా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ కందాల భిక్షంరెడ్డి ప్రారంభించారు. బొర్రయ్య, భూపతి యశోద, జగన్, మాధవ్ పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా భవనాలు!



జిల్లా కేంద్రంలోని డీసీహెచ్ఎస్ భవనంలో సదరం క్యాంపునకు వచ్చిన ప్రజలు


బొట్టుగూడలో కూలడానికి సిద్ధంగా ఉన్న పాత భవనం


శిథిలావస్థకు చేరిన మున్సిపల్ కాంప్లెక్స్


రిజిస్ట్రేషన్ కార్యాలయం

నల్లగొండ పట్టణంలోని పలు చోట్ల పాత భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. పాత భవనాలను కూల్చకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఓ భవనాన్ని డీసీహెచ్ఎస్(డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్) కార్యాలయానికి కేటాయించారు. ఆ భవనంలో ప్రస్తుతం సదరం క్యాంపు నిర్వహిస్తున్నారు. భవనం స్లాబ్ పైభాగంలో పెచ్చులూడిపోవడంతో వర్షాలకు ఎప్పుడు కూలుతుందో అని సదరం క్యాంపునకు వచ్చేవారు, కార్యాలయంలో పని చేసే సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా మున్సిపల్ కాంప్లెక్స్, రిజిస్ట్రేషన్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుని వర్షాలకు కూలే అవకాశం ఉందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


నకిరేకల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్ : భారీ వర్షాల నేపథ్యంలో నకిరేకల్ నియోజకవర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉంటున్న ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలువలు, చెరువులు, వాగులు, డ్రెయినేజీల వద్దకు వెళ్లకూడదన్నారు. ఇనుప విద్యుత్ స్తంభాలను పిల్లలు ముట్టుకోకుండా చూసుకోవాలని కోరారు.

మర్రిగూడ : వరుసగా కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.రంగారెడ్డి, విద్యుత్ ఏఈ రాజేష్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. తడిసిన విద్యుత్ స్తంభాలను, మీటర్లను తాకరాదని, స్విచ్ బోర్డులను తడిచేతులతో ముట్టుకోవద్దని, చిన్నపిల్లలను కరెంట్ పరికరాలకు దూరంగా ఉంచాలని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా మర్రిగూడ ఎస్ఐ కె.రంగారెడ్డి 8712670231 నంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

కనగల్ : మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నర్రా అంతిరెడ్డి సూచించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొలాలకు వెళ్లే రైతులు విద్యుత్ స్తంభాలు, మోటార్ల వద్దకు వెళ్లవద్దన్నారు. చిన్నారులను ఇంటి నుంచి బయటకు పంపొద్దని కోరారు. వీధుల్లో ఉన్న కరెంట్ పోళ్లను ముట్టుకొవద్దని, విద్యుత్ సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు.

శాలిగౌరారం లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ అవార్డులు


అవార్డు అందుకుంటున్న శ్రీనివాసులు

శాలిగౌరారం : ఇంటర్నేషనల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో శాలిగౌరారం లయన్స్ క్లబ్‌కు పలు అవార్డులు దక్కాయి. రూరల్ విభాగంలో జిల్లా ఉత్తమ క్లబ్ అవార్డు, మెంబర్‌షిప్ గ్రోతింగ్‌లో బెస్ట్ అవార్డు, జిల్లా ఉత్తమ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల విభాగంలో బుడిగె శ్రీనివాసులు, దునుక వెంకన్నకు అవార్డులు వచ్చాయి. లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్, రాష్ట్ర మల్టిపుల్ చైర్మన్ తీగల మోహన్‌రావు శాలిగౌరారం క్లబ్ ప్రతినిధులకు అవార్డు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. క్లబ్ ప్రస్తుత మండల అధ్యక్షుడు మారం వేణుగోపాల్‌రెడ్డి, మారోజు వెంకటాచారి పాల్గొన్నారు.

వర్షంలో కొనసాగుతున్న కార్మికుల సమ్మె

కట్టంగూర్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె గురువారం 14వ రోజుకు చేరుకుంది. పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కత్తుల రామలింగయ్య, మండల ప్రధాన కార్యదర్శి పొన్న అంజయ్య, చిలుముల రవి, పాలడుగు బాలు, తాటి కొండయ్య, వెంకన్న, బెల్లి లింగయ్య, పురుషోత్తం, వేముల అంజయ్య ఉన్నారు.

శాలిగౌరారం : గ్రామపంచాయతీ కార్మికులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 15వ రోజుకు చేరుకుంది. సంఘం జిల్లా అధ్యక్షుడు గూని గంగరాములు, మండల అధ్యక్షుడు మందుల సాయిలు, ఉపాధ్యక్షుడు బోడ నర్సింహ, కార్యదర్శి చర్లపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి మద్ది మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులు రాస్తారోకో

చండూరు : చండూరు, గట్టుప్పల్ మండలాలకు చెందిన గ్రామపంచాయతీ కార్మికులు చండూరు మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె గురువారం 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ మోగదాల వెంకటేష్, గ్రామపంచాయతీ ఉద్యోగుల కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఏర్పుల సైదులు, నాంపల్లి శంకరయ్య, దోటి సుజాత, కిన్నెర అబ్బయ్య, వెంకటమ్మ, పద్మ, పి.చంద్రయ్య, వెంకన్న, పరమేష్, మహేందర్, శ్రీనివాస్, భిక్షం, యాదగిరి, నాగరాజు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.


చండూరు : వర్షంలో రాస్తారోకో చేస్తున్న పంచాయతీ కార్మికులు

మునుగోడు : గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్షంలోనూ సమ్మె కొనసాగించారు. రెడ్డిమల్ల యాదగిరి, పందుల నర్సింహ, సాయి, శ్రీను, అచ్చమ్మ, అరుణ, మారమ్మ, పెంటయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి మండలంలో..

నాంపల్లి : జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెకు గురువారం టీడీపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు మొగుదాల పార్వతమ్మ, పగడాల లింగయ్య, నాంపల్లి చంద్రమౌళి, మంగి మహేష్, ప్రకాశ్, నరేష్, ఎదుళ్ళ రాములు, చిత్ర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె గురువారం 15వ రోజుకు చేరుకుంది. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా కార్మికులు సమ్మె కొనసాగించారు. వట్టిపల్లి హన్మంతు, ఊరిపక్క లింగయ్య, రాములు, ముత్తమ్మ, వెంకటయ్య, ముత్తయ్య, సునీత, నర్సింహ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

నల్లగొండ టూటౌన్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పిలుపు మేరకు హైదరాబాద్ శివారు బాటసింగారంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు పరిశీలించేందుకు వెళ్తున్న స్థానిక బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బొజ్జ నాగరాజు, గుర్రం వెంకన్న, ఐతరాజు సిద్ధు, సాయి తదితరులు ఉన్నారు.

నల్లగొండ రూరల్ : డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలనకు వెళ్లకుండా నల్లగొండ మండలంలోని బీజేపీ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయినవారిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బోగరి అనిల్, జిల్లా ప్రచార కార్యదర్శి జగ్జీవన్, మండల కార్యదర్శి నర్సింహ, శ్రీకాంత్, చంటి, నగేష్ తదితరులు ఉన్నారు.

కనగల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు చలో బాటసింగారం డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలనకు వెళ్లనీయకుండా మండలంలోని బీజేపీ నాయకులను గురువారం కనగల్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయినవారిలో బీజేపీ కనగల్ మండల అధ్యక్షుడు పులకరం భిక్షం, ఉపాధ్యక్షుడు కొర్వి శ్రీనివాస్, నీలకంఠం వెంకన్న, పాలోజు భిక్షమాచారి, చెదురుపల్లి సైదులుగౌడ్, నకిరేకంటి యాదయ్య, పరమేష్, సింగం నాగరాజు, బొంత నర్సింహులు, తిరుమలేష్ తదితరులున్నారు.

కేతేపల్లి : డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలనలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చలో బాటసింగారం పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని బీజేపీ నాయకులను కేతేపల్లి పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అయితగోని అనిత, మండల అధ్యక్షుడు రాచకొండ గోపి, నాయకులు తాడోజు నర్సింహాచారి, జటంగి రాంచంద్రయ్య, రాచకొండ శ్రీనివాస్, వీరబోయిన నాగయ్య, ఎ.చంద్రశేఖర్ ఉన్నారు.

చిట్యాల : బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలనకు వెళ్లకుండా ఉండేందుకు చిట్యాలలోని పలువురు బీజేపీ నాయకులను గురువారం స్థానిక పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


నల్లగొండలో పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

అరెస్టయినవారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేపూరి రవీందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కూరెళ్ళ శ్రీను, చికిలంమెట్ల అశోక్, కన్నెబోయిన మహాలింగం, కోళ్ళ స్వామి, సతీష్, శేఖర్, సలీం, విష్ణుతో పాటు మరికొందరు ఉన్నారు.

శాలిగౌరారం: హైదరాబాద్ శివారులోని బాటసింగారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలనకు వెళ్లకుండా మండలంలోని బీజేపీ నాయకులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్ అల్లి రాములు, యాదగిరి, షేక్ సయ్యద్, కిష్టయ్య, రాజు, అంజయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, మురళి తదితరులు ఉన్నారు.

చండూరు(గట్టుప్పల్) : డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలనకు వెళ్లకుండా ముందస్తుగా గట్టుప్పల్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథంతో పాటు స్థానిక నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

చండూరు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు 'చలో బాటసింగారం' కార్యక్రమానికి వెళ్తున్న మండలంలోని బీజేపీ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల, మున్సిపల్ అధ్యక్షులు కొరిమి ఓంకారం, అన్నెపర్తి యాదగిరి, జిల్లా నాయకులు దోటి వెంకటేష్ యాదవ్, కొత్తపాటి సతీష్, ఏనుగు వెంకట్ రెడ్డి, భూతరాజు శ్రీహరి, తిరందాసు శ్రీను, ఐతరాజు మల్లేష్, పార్టీ ప్రధాన కార్యదర్శులు పందుల సత్యం గౌడ్, ముదిగొండ ఆంజనేయులు, యువమోర్చా అధ్యక్షుడు సోమ శంకర్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మాదగోని నాగార్జునగౌడ్ తదితరులు ఉన్నారు.

కట్టంగూర్ : డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన కార్యక్రమానికి వెళ్లకుండా మండలంలోని బీజేపీ నాయకులను గురువారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పసుల సైదులు, ముడుసు భిక్షపతి పాదూరి వెంకట్‌రెడ్డి, హనుమంతు, వినోద్, హరిబాబు ఉన్నారు.

నాంపల్లి : బాటసింగారంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలనకు వెళ్లకుండా ముందస్తుగా గురువారం మండలంలోని బీజేపీ నాయకులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో బీజేపీ మండల అధ్యక్షుడు పూల వెంకటయ్య, సింగారపు గిరి, రమేష్, కర్నాటి సాంబశివ, గాదెపాక నాగరాజు, యాదయ్య, పరమేష్ తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం నాంపల్లిలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాంపల్లి సతీష్, గిరి, మహేష్, వెంకటయ్య, భారత్, శ్రీకాంత్, పరమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు బాటసింగారంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలన కార్యక్రమంలో మండలంలోని బీజేపీ నాయకులు పాల్గొనకుండా గురువారం మర్రిగూడ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కొడాల వెంకట్‌రెడ్డి, రాజేందర్‌నాయక్, జమ్ముల వెంకటేష్‌గౌడ్, ఎలిమినేటి సత్తిరెడ్డి, మెండు దీపికరెడ్డి, పగిళ్ల లింగస్వామి, అల్వాల్‌రెడ్డి, నరేష్, శ్రీకాంత్, శంకర్, రాంబాబు, రవి, రమేష్, సాయి, శేఖర్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్ట్‌ను నిరసిస్తూ గురువారం మర్రిగూడ చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. మర్రిగూడ మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, పరుశురాంగౌడ్, రాజేందర్‌నాయక్, సిలివేరు వెంకటేష్, సత్తిరెడ్డి, వెంకటేష్‌గౌడ్, జిల్లా కిశోర్, మహేష్, యాదయ్య, నగేష్, యాదగిరి, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

నల్లగొండ టూటౌన్ : వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులపై పట్టణంలోని ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉండేవిధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి అన్నారు. గురువారం నీలగిరి మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులు, సిటిజన్ ఫీడ్ బ్యాక్, మెప్మా కార్యకలాపాలపై మెప్మా సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం కల్పించాలని కోరారు. ప్రతి ఆదివారం పారిశుద్ధ్యంపై నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. సమావేశంలో మెప్మా టీఎంసీ శ్రీనివాస్, సీఓలు నర్సింహ, జ్యోతి, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా పకడ్బందీగా తయారు చేయాలి


చండూరు : బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న వెంకటేశ్వర్లు

చండూరు : ఓటరు జాబితా తయారు తప్పులు లేకుండా పకడ్బందీగా చేసే బాధ్యత బీఎల్‌ఓలపై ఉందని తహసీల్దారు అర్చనారెడ్డి అన్నారు. తప్పులు లేని ఓటర్ జాబితా తయారీపై బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మృతి చెందిన ఓటర్లను కుటుంబ సభ్యుల నుంచి ధృవీకరణ పత్రం తీసుకున్న తర్వాతనే జాబితా నుంచి తొలగించాలన్నారు. సమావేశంలో ఎన్నికల డీటీ దీపక్ ఏఎల్ఎంటీలు ఎం. వెంకటేశ్వర్లు, యాదయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 1వ తేదీ వరకు ఓటు నమోదు పూర్తి చేయాలి

నార్కట్‌పల్లి : అక్టోబర్ 1వ తేదీ వరకు ఓటు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తహసీల్దార్ పులి సైదులు అన్నారు. మండలంలోని బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లకు మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తరుణ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సునిత, అంజమ్మ తదితరులు ఉన్నారు.

రైతుల శ్రమదానం

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే రాచకాల్వ నుంచి మండలంలోని రామాంజాపురం సమీపంలో గల శామోరికత్వ వద్ద వృథాగా పోతున్న వరద నీటిని రామగిరి, ఎన్‌జి కొత్తపల్లి గ్రామాల రైతులు గురువారం చాడ హతీష్‌రెడ్డి నేతృత్వంలో శ్రమదానం చేసి అరికట్టారు. ఈ కార్యక్రమంలో రామగిరి, ఎన్‌జి కొత్తపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.


వృథాగా పోతున్న నీటిని అరికడుతున్న రైతులు

మహాసభలను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : కరీంనగర్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించే అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర మహాసభల్లో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతం కృషి చేస్తుందన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షం

మునుగోడు : మండల వ్యాప్తంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు కురుస్తోంది. దీంతో వారం రోజుల క్రితం వరకు వాడిపోయిన పత్తి చేలకు ప్రాణం పోసినట్లయింది. ఆలస్యంగా అయినా వరుణ దేవుడు కరుణించడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సాగుచేసిన పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం


సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నకిరేకల్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ హాస్టళ్ల సంరక్షణ -ప్రభుత్వ విద్యా పరిరక్షణ సంఘర్షణ సైకిల్ యాత్రను నకిరేకల్‌లో గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో అసౌకర్యాల నడుమ విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, వెంకటేశ్వర్లు, యాత్ర బృందం ప్రతినిధులు లక్ష్మణ్, రేణుక, సైదా, వెంకట్, రమేష్, గోపీనాథ్, రవీందర్, జగదీశ్, జగన్, వీరన్న, తరుణ్, సాయి, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్రలో భాగంగా గురువారం అయిటిపాముల గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, జిల్లా అధ్యక్షుడు నరేష్, లక్ష్మణ్, రేణుక, గోపినాథ్, నరేష్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించాలి


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నకిరేకల్ : పీఆర్సీ ప్రకటించాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ నకిరేకల్‌లో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం ప్రతినిధులు యాట మధుసూదన్‌రెడ్డి, బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రెండో విడత పీఆర్సీ తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారనీ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు టీ.నర్సింహమూర్తి, యాకుబ్‌అలీ, రఘు, రఫీ, నాగరాజు, శ్రీనివాస్, భూపాల్, సైదులు, తిరుమలయ్య, వేణుగోపాల్, భద్రయ్య, నగేష్, ఉపేందర్ రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భిక్షమయ్యగౌడ్ జన్మదిన వేడుకలు

మర్రిగూడ : ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్యగౌడ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనను మర్రిగూడ మాజీ ఎంపీపీ, అనంతరాజుగౌడ్ గురువారం హైదరాబాద్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యాదగిరిగౌడ్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

చెత్తకుప్పలుగా మారిన వీధులు


మునుగోడు ప్రధాన కూడలిలో పేరుకుపోయిన చెత్త

మునుగోడు : పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో మండలంలోని పలు గ్రామాల్లోని వీధులు చెత్త కుప్పలుగా మారిపోయాయి. మురికి కాల్వల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీల్లో మురుగు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు అధికమై అనారోగ్యానికి గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా వార్షికోత్సవం

నార్కట్‌పల్లి : బ్యాంక్ ఆఫ్ బరోడా వార్షికోత్సవాన్ని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వాటర్ ఫిల్టర్‌ను ఎస్ఐ సైదాబాబుకు బ్యాంకు మేనేజర్ బోయిని వెంకన్న అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ గుగులోతు వీరస్వామి, సతీష్, స్పెషల్ అసిస్టెంట్ చింతపల్లి లింగారెడ్డి, ఏఎస్ఐ నర్సిరెడ్డి, క్యాషియర్ ధనమ్మ, మల్లేష్, ఓం ప్రకాష్, నర్సింహాచారి తదితరులు ఉన్నారు.


ఎస్ఐకి వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న మేనేజర్